## క్లుప్తంగా

### యువత దురలవాట్లకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ సుకుమార్

**నంద్యాల(న్యూటౌన్):** యువత దురలవాట్లకు దూరంగా ఉండి జీవిత లక్ష్యాన్ని చేరుకోవాలని రఫా ఆసుపత్రి వైద్యులు సుకుమార్, పాస్టరేట్–6 చైర్మన్ బి.కాంతారావు, ఆల్ సెయింట్ చర్చి సెక్రటరీ జీడీ కిరణ్ అన్నారు. శనివారం నంద్యాల మండలంలోని నంద్యాల డయాసిస్ అధ్యక్ష మండల పరిధిలోని మిట్నాల సీఎస్ఐ చర్చిలో యూత్ మెగా ఫెస్టివల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ క్రీస్తు బోధన సారంగా యువత నడుచుకోవాలన్నారు. పాస్టరేట్–1 యూత్ ఫెలోసిప్ సభ్యులు పాల్గొని ప్రత్యేక కీర్తనలు పాడారు. కార్యక్రమంలో మిట్నాల సీఎస్ఐ యూత్ సభ్యులు, సంఘ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

### సత్తా చాటిన సీఎంఎస్ విద్యార్థులు



మాట్లాడుతున్న కళాశాల డైరెక్టర్

**నంద్యాల(న్యూటౌన్):** ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో సీఎంఎస్ జూనియర్ కళాశాల విద్యార్థులు స్టేట్ ర్యాంకులతో సత్తా చాటారని డైరెక్టర్ మునిశేఖర్, శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను 464, 463, 462, 459, 458, 453, 452, 450 మార్కులు కాకుండా 400 పైబడి ఎక్కువ మంది విద్యార్థులు సాధించారన్నారు. తమ కళాశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. ఈ ఏడాది ఎంసెట్‌లో కూడా మంచి ర్యాంకులు సాధించారన్నారు.

### అరుగు నుంచి కింద పడి ..

**బేతంచెర్ల:** పట్టణంలో ఓ వ్యక్తి అరుగుపై నుంచి పడి మృతి చెందాడని హెడ్ కానిస్టేబుల్ చెన్నయ్య తెలిపారు. ఆయన వివరాల మేరకు.. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో కుమ్మరి వెంకటేశ్వర్లు(30) నివాసం ఉంటున్నారు. శుక్రవారం రాత్రి పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న స్వామిరెడ్డి కాంప్లెక్స్ వద్ద ఉన్న అరుగుపై పడుకున్నాడు. ప్రమాదవశాత్తు అరుగుపై నుంచి బోర్లాపడి గాయాలై అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. శనివారం ఉదయం కొన ఊపిరితో ఉన్న అతన్ని ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

### అనుమతి లేనిదే మట్టి తవ్వరాదు

**పాణ్యం:** అనుమతులు లేనిదే మట్టి తవ్వరాదని మైనర్ ఇరిగేషన్ ఏఈ చంద్రుడు సూచించారు. పిన్నాపురం రస్తాలో ఉన్న ఓబులమ్మ కుంటలో మట్టి తవ్వుతున్న జేసీబీ, నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఆయన శనివారం తెలిపారు. ఓబులమ్మ కుంట దాదాపు 8 ఎకరాల విస్తీర్ణంలో ఉందన్నారు. రైతులకు మట్టి తీసుకునేందుకు దరఖాస్తు చేసుకుంటే అనుమతులు ఇస్తామన్నారు. అనుమతులు లేకుండా కుంటలో మట్టిని తవ్వితే మాత్రం చర్యలు తప్పవని హెచ్చరించారు.

### అనాథ శవానికి అంత్యక్రియలు

**కర్నూలు (టౌన్):** అనాథ శవానికి అంత్యక్రియలు చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వేదాస్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు, యహ్యా కర్నూలు సేవా సమితి సభ్యులు నౌషాద్ ముందుకు వచ్చి అంత్యక్రియలు జరిపించారు. వివరాలు.. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో గత నాలుగేళ్లుగా వెంకటేశ్వరరావు (65) అనే అనాథ వృద్ధుడు ఆశ్రయం పొందుతున్నాడు. పెరాలసిస్‌తో వ్యాధితో ఇబ్బంది పడుతున్నారు. వారం రోజులుగా ఆయాసంతో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. ఆయనకు అంత్యక్రియలు చేసేందుకు వేదాస్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు సునీల్‌కుమార్, యహ్యా సంస్థ సభ్యులు నౌషాద్ ముందుకు వచ్చారు.





నంద్యాల: కుబ్రామసీదులో ముస్లింలకు సందేశం ఇస్తున్న అంజాద్‌బాషా, గోస్పాడు : యాళ్లూరులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు, ఉయ్యాలవాడ: ఈద్గా వద్ద దువా చేస్తున్న దృశ్యం



రుద్రవరం: ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

# త్యాగనిరతికి ప్రతీక బక్రీద్

**నంద్యాల(వ్యవసాయం)/గోస్పాడు:** ముస్లింలు బక్రీద్ పండుగను శనివారం ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో ఉదయం 6గంటల నుంచే మసీదులు, ఈద్గాలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రవక్త హజరత్ ఇబ్రహీం అలైహిసలాం ఆయన కుమారుడు ఇస్మాయిల్ ఆలై హిసలాంలు చేసిన త్యాగాన్ని స్మరించుకున్నారు. స్థానిక జామియా మసీదులో మౌలానా ఇమ్రాన్, భీమవరం రస్తాలోని అల్‌ఫుర్ఖానా ఇమాం మౌలానా హాఫీజ్ అబ్దుల్ హాదీ సాహెబ్, మూలసాగరం ఈద్గాలో మౌలానా మహబూబ్‌బాషా, సాయిబాబా నగర్‌లోని ఖుబ్రాఈద్గా అంజాద్‌బాషా సిద్దిఖీ, ఎస్సార్బీసీ కాలనీకి వెళ్లే రహదారిలో తౌయిబా ఈద్గాల వద్ద ముఫ్తీ రఫీ సాహెబ్, జుమ్మామసీదు, అంటికోట మసీదు, గాంధీచౌక్ మసీదు, ఆర్టీసీ బస్టాండ్ వద్ద, డబరాల మసీదు ఉన్న మసీదులలో ముస్లింలు పెద్ద ఎత్తున ఇమాంలు ఉదయం 6.30గంటలకు, 7.30గంటలకు 9.30గంటలకు ఈదుల్ జుహా ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ముస్లింలు నూతన వస్త్రాలు ధరించి పిల్లలు, పెద్దలు, మహిళలు ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇమాంల సంఘం అధ్యక్షుడు అంజాద్‌బాషా సిద్దిఖీ మాట్లాడుతూ ప్రతి మనిషి ప్రవక్త సూచించిన ఆధ్యాత్మిక మార్గంలో నడవాలన్నారు.



నంద్యాల సాయిబాబాగనర్ కుబ్రా ఈద్గాలో ప్రార్థనలు పాల్గొన్న ముస్లింలు

- **రుద్రవరం/దొర్నిపాడు/ఉయ్యాలవాడ:** నియోజకవర్గ వ్యాప్తంగా శనివారం బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఆయా ప్రార్థనా మందిరాల్లో మత బోధకులు మాట్లాడుతూ త్యాగధనుడు ఇబ్రహీం ప్రవక్త స్ఫూర్తితో సాటివారి కోసం తనకు ఉన్నంతలో ఎంతో కొంత త్యాగం చేసే గుణాన్ని అలవరచుకోవాలని ఈ భావాన్ని మానవుల్లో కలిగించడమే ఈదుల్ అజహా (బక్రీద్) పర్వదిన పరమార్థమని సూచించారు. ఉయ్యాలవాడ మండల కేంద్రంలోని నూరాన్ మసీద్, జామియా మసీదుల నుండి ముస్లిం సోదరులు ఇబ్రహీం, ఇస్మాయిల్, జబిదుల్లా త్యాగాలను స్మరించుకుంటూ ర్యాలీగా కుందూనది ఒడ్డున వున్న ఈద్గా వద్దకు ఉదయం 8.30 గంటలకు చేరుకున్నారు. హాఫీజ్ ఇస్మాయిల్ ముస్లిం సోదరులతో ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. అనంతరం ముస్లింల కబర్‌స్తాన్‌లో మౌళిక వసతుల్లో భాగంగా రేకుల షెడ్ నిర్మాణానికి ఆర్థిక సహాయాన్ని అందజేయడంతో విశ్రాంతి ఉద్యోగి సికె జమాలుద్దీన్‌ను మండల కోఆప్షన్ మెంబర్ అమీర్ అహమ్మద్, దండు మహమ్మద్, ముస్లిం సోదరులు కలిసి శాలువ కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.



ఆళ్లగడ్డ పట్టణంలో ట మసీదులో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం






చాగలమర్రి: ఖుద్బా చదువుతున్న ఇమాం హాఫీజ్ ముల్లా ముజీబుర్ రెహ్మాన్, ప్రార్థనలకు హాజరైన ముస్లింలు

**ఆళ్లగడ్డ/చాగలమర్రి/శిరివెళ్ల:** మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ చాగలమర్రితో పాటు పెద్దవంగలి, చిన్నవంగలి, ముత్యాలపాడు, మద్దూరు, శెట్టివీడు, మల్లెవేముల తదితర గ్రామాలలో బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా చాగలమర్రి ఈద్గాలో ముస్లింలు సామూహికంగా ప్రత్యేక నమాజు చేశారు. మత గురువులైన ఇమాం హాఫీజ్ ముల్లా ముజీబుర్ రెహ్మాన్, ఖాజీ ముల్లా యూనుస్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక దువా కార్యక్రమాన్ని నిర్వహించారు. శిరివెళ్ల, బోయలకుంట్ల, గోవిందపల్లె, యర్రగుంటల, చెన్నూరు, కోటపాడు, మహదేవపురం, గుంప్రమాన్‌దిన్నె, వనికినిదిన్నె, జీనేపల్లెలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.






దొర్నిపాడు: క్రిష్టిపాడులో.. నంద్యాల: భీమవరం రస్తాలోని ఈద్గాలో బక్రీద్ విశిష్టతను వివరిసు మతపెద్ద, ఎస్సార్బీసీ ఈద్గాలో నమాజ్ చేస్తున్న ముస్లింలు, శిరివెళ్ల: ప్రార్థనలకు హాజరైన ముస్లింలు

## భక్తిశ్రద్ధలతో బాలాలయ వేడుకలు

**నంద్యాల(వ్యవసాయం):** పట్టణ శివారులోని మూల మఠంలో వెలసిన శ్రీభీమలింగేశ్వర ఆలయ జీర్ణోద్ధరణ వేడుకలు శనివారం వేదపండితుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయాన్నే శ్రీమహాగణపతి పూజ, పంచగవ్య మేళనం, మండప దేవతా ఆహ్వానం, మూలమంత్ర జపాలు, మూలమూర్తులకు పంచామృత రుద్రాభిషేకాలు, రుద్రహోమం, విగ్రహ దేవత మంత్ర ఉపనిశత్ కార్యక్రమాలు నిర్వహించి స్వామి వారికి మహామంగళ హారతి ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం ప్రదోషకాల పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఈఓ వేణునాథరెడ్డి మాట్లాడుతూ సీజీఎఫ్ నిధులతో ఆలయ పునఃనిర్మాణ పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం మూలవిగ్రహాలను కదిలించి వాటి స్థానంలో తాత్కాలిక విగ్రహాలు ఉంచి ప్రతిరోజూ పూజలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు గొట్టి ముక్కల వెంకటరమణ శాస్త్రి, కౌన్సిలర్ భీమునిపల్లె పురందర్, తదితరులు పాల్గొన్నారు.



భీమలింగేశ్వర ఆలయంలో కలశ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

## పెద్దమ్మ దేవర ఏర్పాట్ల పరిశీలన



పెద్దమ్మ ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ ప్రమోద్

**దొర్నిపాడు:** డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో ఆదివారం నుంచి జరిగే మూలపెద్ద మ్మ దేవర ఏర్పాట్లను డీఎస్పీ ప్రమోద్ శనివారం రాత్రి పరిశీలించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్ల ఏర్పాట్లు, తాగు నీరు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై సీఐ మురళీధర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులతో ఆరా తీశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా దర్శన వేళల్లో తొక్కిసలాట జరక్కుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా ఆలయ కమిటీ కూడా స్వచ్ఛందంగా వలంటీర్లను నియమించాలని సూచించారు. డీఎస్పీ వెంట ఎస్ఐ సత్యనారాయణ ఉన్నారు.

## గ్రామ పంచాయతీ కార్మికులకు పీఎఫ్ అమలు చేయాలి

**నంద్యాల(న్యూటౌన్):** గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనంతో పాటు పీఎఫ్ అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శి ఏసురత్నం, భాస్కర్ అన్నారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులు 40 సంవత్సరాలుగా అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్నారన్నారు. జీతాల పెంపు జీవో 57, 132, 142, 680 అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీవోనం.132 ప్రకారం గుర్తింపు కార్డులు, కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ ప్రతినెల 5వ తేదీలోపు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దహన సంస్కారాలకు రూ.15 వేలు ఇవ్వాల్సి ఉండగా కాని ఇవ్వడం లేదన్నారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ భారత్ లాంటి ఆకర్షణీయమైన నినాదాలతో ప్రచారం హోరెత్తిస్తూ వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా పంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచడంలో కూటమి ప్రభుత్వ విఫలమైందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏసురత్నం

## మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

**చాగలమర్రి:** బదిలీల్లో ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఎస్టీయూ చాగలమ్రరి శాఖ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా ఆ శాఖ మండల అధ్యక్షుడు గూబగుండం మస్తాన్‌బాషా మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సంఘాలతో జరిపిన చర్చల్లో ఎస్‌జీటీ బదిలీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ జరుపుతామని రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ హామీ ఇచ్చి విస్మరించారన్నారు. వెబ్ కౌన్సెలింగ్‌కు సన్నద్ధం చేయడం ఉపాధ్యాయులను మోసగించడమేనని, ప్రభుత్వం వెంటనే కౌన్సెలింగ్‌ను వాయిదా వేయాలన్నారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా ఆదివారం డీఈఓ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాకు ఉపాధ్యాయులు తరలిరావాలన్నారు.

## బోరుకు మరమ్మతులు చేపట్టండి

**నంద్యాల(న్యూటౌన్):** తాగు నీరు బోరు పని చేయకపోవడతో పట్టణంలోని బొమ్మల సత్రం ఇబ్బందులు పడుతున్నారు. బొమ్మలసత్రం సర్కిల్ సమీపంలో లోని బోరు 20రోజులుగా మరమ్మతులకు గురి కావడంతో బోరు మీద ఆధార పడ్డ కుటుంబాలు, హోటళ్ల యజమానులు, రాత్రి పూట ప్రయాణీకులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. నీటిని సుదూర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకోవాల్సి రావడంతో వ్యయ ప్రయాసాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి బోరుకు మరమ్మతులు చేపట్టి ఆదుకోవాలన్నారు.



పని చేయని బోరు

## సమాజ హితమే లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ ఉద్యమం



మాట్లాడుతున్న నాగరాజు మాదిగ

**నంద్యాల(అర్బన్):** సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలు లేని నూతన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ ఉద్యమం కొనసాగిందని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు మాదిగ అన్నారు. సమాజానికి కృతజ్ఞతగా ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా శనివారం స్థానిక నిశాంత్ భవన్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా, అనుబంధ సంఘాల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమ ముఖ్యఅతిథి నాగరాజు మాదిగ మాట్లాడుతూ మాదిగ సమాజానికి దక్కాల్సిన రిజర్వేషన్ హక్కులతో పాటు నిరాదరణకు గురైన వర్గాలైన వికలాంగ, వృద్ధుల, వితంతువుల కోసం పోరాడి వారికి పెన్షన్లు అందేలా పోరాడామన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఓబులేసు మాదిగ, బాయికాటి బెనర్జీ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల్లో ప్రత్యేక పూజలు

**ఉయ్యాలవాడ:** సుద్దమల్ల, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ లక్ష్మీ నరసింహ కంబగిరిస్వామి, శ్రీ అభయాంజనేయ స్వామి, శ్రీ లక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు వేకువజామున్నే ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు లక్ష్మణస్వామి, కమలేష్‌శర్మ, అనంతయ్య, భాస్కరశర్మలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.





## దాహం..దాహం!

- మహానందిలో పనిచేయని జలప్రసాద కేంద్రం

**మహానంది:** మహానందిలో భక్తులను తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. భక్తుల సౌకర్యార్థం దివీస్ ల్యాబొరేటరీస్ వారు ప్రసాదాల కౌంటర్, టీటీడీ కల్యాణమండపం, ఆలయంలోని వెళ్లే చిన్నగేటు వద్ద మూడు జలప్రసాద కేంద్రాలను ప్రారంభించారు. అయితే చిన్న గేటు వద్ద ఉన్న జలప్రసాద కేంద్రం పనిచేయకపోవడంతో ఇటువైపు వచ్చిన భక్తులకు తాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. దీంతో భక్తులు 20 లీటర్ల మంచి నీటి క్యానుకు రూ.40 నుంచి రూ. 50లకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మినరల్ వాటర్ ప్లాంట్ పనిచేయకపోవడంతో పక్కనే ఉన్న సాధారణ కుళాయిలో నీళ్లు పట్టుకుని వెళ్లాల్సి వస్తుందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి జలప్రసాద కేంద్రానికి మరమ్మతులు చేయించి భక్తులకు మినరల్ ఫిల్టర్ నీళ్లు అందించాల్సిన అవసరం ఉంది.





పనిచేయని జలప్రసాద కేంద్రం